సాక్షి చిత్తూరు
గురువారం । 24 । అక్టోబర్ । 2024



కౌండిన్యలో మరణ మృదంగం

అటవీ ప్రాంతంలో వేటగాళ్లు బిగించే ఉచ్చుకు చిరుత పులులు చిక్కుతుండడంతో వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతోంది. - 8లో



హోరాహోరీగా పోటీలు

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఉమ్మడి పోటీలు నగరిలోని ఏకాంబరకుప్పం హైస్కూల్‌లో హోరాహోరీగా జరిగాయి. - 8లో



ఆలయంలో చోరీ

నగరిలోని మహాముునేశ్వర స్వామి ఆలయంలో హుండీని దుండగులు పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. - 8లో

న్యూస్‌రీల్

హెడ్‌కానిస్టేబుల్‌కు పురస్కారం



జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దామోదరం

గంగాధర నెల్లూరు: మండలకేంద్రంలోని జీడీ నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దామోదరం బుధవారం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు చేతుల మీదగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. చాట్‌బాట్ యాప్ ద్వారా దామోదరం దాదాపు 70 ఫోన్లను అతి తక్కువ వ్యవధిలో రికవరీ చేసినందుకు ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది దామోదరంను అభినందించారు.

రేపటి నుంచి పశుగణన

చిత్తూరు రూరల్: జిల్లాలో 21వ జాతీయ పశుగణన చేపట్టేందుకు పశుసంవర్ధకశాఖ సిద్ధమైంది. ఈనెల 25వ తేదీ నుంచి సర్వే ప్రారంభించనుంది. ఈనేపథ్యంలో పశుగణన చేపట్టే గణనకర్తలకు 8రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చింది. వరుసగా నాలుగు నెలల పాటు నిర్వహించే పశుగణనలో మూగజీవుల లెక్క తేలనుంది. ఇందుకోసం 384 మంది గణనకర్తలు, 67 మంది సూపర్‌వైజర్లను నియమించింది. ప్రతి రెవెన్యూకు ఒక గణన కర్తను కేటాయించింది. వీరు 32 మండలాలు, 5 అర్బన్ ప్రాంతాల్లో పశుగణన చేయనున్నారు. కాగా సర్వే 2025 ఫిబ్రవరి 28 నాటికి ముగియనుందని అధికారులు చెబుతున్నారు.

సర్వే ఇలా..

పశుగణన సర్వేలో భాగంగా గ్రామాల్లోని ప్రతి నివాసాన్ని గణనకర్తలు సందర్శిస్తారు. గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, తదితర వాటిని జాతుల వారీగా లెక్కకడతారు. గణనకర్త యాప్ ద్వారా సర్వే చేస్తారు. అధికారుల లెక్కల ప్రకారం గణన కర్తలు 4,60,0076 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది.

గణాంకాల ఆధారంగా బడ్జెట్

పశుగణన ఆధారంగా జిల్లాకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ రానుందని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. దీంతో పాటు వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా అవుతాయన్నారు. ఈనేపథ్యంలో పాడి రైతులు సర్వే కోసం వచ్చే వారి వద్ద కచ్చితమైన సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు.

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం



జిల్లా జడ్జితో కలిసి క్యాంటీన్ ప్రారంభిస్తున్న ద్వారకనాథరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయం ఆవరణలో క్యాంటీన్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథరెడ్డి బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావుతో కలిసి క్యాంటీన్‌ను ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం క్యాంటీన్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్, ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఇందులో రూ.1,24,94,275 భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. అలాగే బంగారం 45 గ్రాములు, వెండి8 59 గ్రాములున్నాయి. గో సంరక్షణ హుండీని లెక్కించగా రూ.13,870, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.21,872, విదేశీ కరెన్సీ యూఎస్ఏవీ 1,011 డాల్లర్లు, యూఏఈ 135 దిర్హామ్‌లు, ఆస్ట్రేలియాకు చెందిన 170 డాలర్లు, సింగపూర్ 60 డాలర్లు, ఇంగ్లండ్ 10 పౌండ్లు, కెనడాకు చెందిన 20 డాలర్లు, యూరోవి 50 యూరోలు వచ్చినట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీకి పక్కా ప్లాన్

వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏముంది ? అన్న చందాన అధికారం చేతిలో ఉంటే సొంత సంస్థలకు ఎలా లబ్ధి చేకూర్చాలో సీఎం చంద్రబాబుకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియదేమో ? గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు తన బినామీలకు భారీగా లబ్ధి చేకూర్చారు. తాజాగా మళ్లీ అధికారంలోకి రావడంతో తన బినామీ అయిన ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థకు దోచిపెట్టేందుకు భారీ ప్లాన్ వేశారు. ఇప్పటికే కుప్పానికి కృష్ణా జలాలను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకురాగా, అదే ఉపకాలువ పనులు చేపట్టేందుకు మళ్లీ రిత్విక్ సంస్థకు అంచనాలు పెంచి ఇచ్చేందుకు సిద్ధం కావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.





పుంగనూరు ఉపకాలువ నుంచి కుప్పానికి గత ప్రభుత్వంలో ప్రవహిస్తున్న నీరు

- ఇప్పటికే నీళ్లొచ్చిన కుప్పం కాలువకు కొత్తగా పనులు చేపట్టేందుకు సిద్ధమైన కూటమి సర్కారు
- ఆర్‌ఆర్ కంపెనీని పక్కన పెట్టిన వైనం
- చంద్రబాబు బినామీ, ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థకు అప్పగించేలా ప్లాన్
- అంచనాలను పెంచి ప్రజాధనం లూటీకి పక్కా స్కెచ్
- తొలి నుంచి బినామీలకు లబ్ధి చేకూరుస్తూ వస్తున్న చంద్రబాబు
- ఇప్పటికే కుప్పానికి కృష్ణా జలాలను తెచ్చిన మాజీ సీఎం జగన్

పలమనేరు : అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రజాధనం దోపిడీయే లక్ష్యంగా కూటమి సర్కారులోని సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. ఇప్పటికే ఇసుక, మట్టి, గ్రానైట్ ఇలా అన్నిటా తమ వారికి లబ్ధి చేకూరుస్తూ వస్తున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు తాజాగా తన పాత మిత్రుడైన సీఎం రమేష్‌కు చెందిన కంపెనీకి, ఇప్పటికే కుప్పానికి నీళ్లొచ్చిన కాలువ పనులు మళ్లీ చేపట్టి, అదనపు దోపిడీ చేసేందుకు సిద్ధమయ్యారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కుప్పం ఉపకాలువ పనులను హెచ్‌ఈఎస్–ఆర్కే–కోయా జాయింట్ సంస్థలు చేపట్టగా, చంద్రబాబు తనకు సన్నిహితుడైన సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థకు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కల్పించారు. ఈ కంపెనీ గడువులోపు పనులు చేయకపోగా అంచనాలను పెంచుకుని ప్రజాధనాన్ని లూటీ చేసింది. ఆ తరువాత కూడా పనులు చేపట్టలేదు. ఆపై 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ పెండింగ్ పనులను చేపట్టాలని సూచించినా సంబంధిత కంపెనీ నిర్లక్ష్యం చేసింది. ఎలాగైనా కుప్పానికి నీటినందించాలనే తలంపుతో గత ప్రభుత్వం పెండింగ్ పనులను ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించింది. ఈ పనులు చాలావరకు జరగడంతో సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది కుప్పానికి కృష్ణా జలలాను అందించి మూడు చెరువులను సైతం నింపారు.

మిగిలిన పనుల కోసం కొత్త ప్లాన్..

కుప్పం ఉపకాలువకు సంబంధించి మిగిలిన రూ.77 కోట్ల పనులను గత ప్రభుత్వంలోని ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేయాల్సి ఉండగా ఈ ప్రభుత్వం ఆ కంపెనీని అసలు పట్టించుకోలేదని సమాచారం. గత టీడీపీ హయాంలో ఈ పనులు చేపట్టిన సీఎం రమేష్ కంపెనీకే గతంలో ఆగిన రూ.77 కోట్ల పనుల అంచనాను మరో రూ.30 కోట్లు పెంచి అంటే రూ.100 కోట్లతో పనులు చేసేలా రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. గతంలో సీఎం రమేష్ కోసం రూ.144 కోట్లు, ఇప్పుడు మరో రూ.30 కోట్లకు పైగా అదనపు నిధుల దోపిడీకి పక్కా స్కెచ్ వేస్తున్నట్టు అర్థమవుతోంది.

కుప్పంపై బాబు కపట ప్రేమ..

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కుప్పానికి నీళ్లందించారు. ఆపై గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి సైతం మూడు చెరువులకు కృష్ణాజలాలు అందించారు. అప్పుడు వచ్చిన నీళ్లు ఇప్పుడెందుకు రావడం లేదనే మాట పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని రైతులకు అర్థం కాని ప్రశ్న.

ఇప్పటికే కుప్పానికి చేరిన కృష్ణా జలాలు



2022లో కుప్పం పర్యటకు వెళ్లిన నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2024లో కుప్పానికి కృష్ణానీటినందిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా కుప్పం కాలువ పనుల్లో ఆగిన 20 శాతం పనులను చేపట్టాల్సి రావడంతో గత ప్రభుత్వం పెండింగ్ కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్ నిర్మాణాలు, 8వేల క్యూబిక్ మీటర్లు మట్టి పనులు, 40 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, మూడు చోట్ల లిఫ్ట్ పనులకు టెండర్లు వేయగా ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.117 కోట్లకు దక్కించుకుంది. దీంతో ఈ కంపెనీ 40 శాతం పనులు చకచకా పూర్తి చేసి కుప్పానికి కృష్ణానీటిని అందించింది.

నీటి మాటేమో గానీ..!

కృష్ణా జలాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీటీఎం నుంచి పుంగనూరు నియోజకవర్గంలోని ఉప కాలువ ద్వారా పెద్దపంజాణి వరకు, అక్కడి నుంచి గంగవరం, బైరెడ్డిపల్లి, వీకోట, రామకుప్పం మీదుగా కుప్పం మండలంలోని పరమసముద్రం వరకు నీళ్లు వస్తాయి. కుప్పం సబ్ కెనాల్‌కు సంబంధించి 2015లో టెండర్లు నిర్వహించగా రూ.430 కోట్లతో హెచ్‌ఈఎస్–ఆరేకే–కోయా కంపెనీలు పనులు దక్కించుకున్నాయి. 2016లోపు ఈ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సదరు కంపెనీలు పనులు చేస్తుండగానే అప్పటి టీడీపీ ప్రభుత్వం సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కంపెనీకి సైతం పనుల్లో భాగస్వామ్యం కల్పించడంతో పనుల పూర్తి చేసేందుకు అంటూ అదనంగా రూ.144 కోట్లను కేటాయించింది. దీంతో పనుల విలువ రూ.575 కోట్లకు చేరింది. ఈ కంపెనీలన్నీ కలసి 80శాతం పనులు పూర్తి చేశాయి. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ రాకతో పనులను ఆపేశారు. గత ప్రభుత్వం ఈ కంపెనీలకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా చలనం లేకుండా పోయింది.



పశుపత్తూరు వద్ద నీరు రాక ఎండిపోయిన కుప్పం ఉపకాలువ

లక్ష్యం ఇదీ..!

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల(కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు)లోని 6,025 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షలమంది ప్రజలకు మంచినీటిని అందించడమే దీని లక్ష్యం. ఇందుకోసం కృష్ణా నది నుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలించే పథకం ఇది. ఇందులో భాగమే కుప్పం, పుంగనూరు ఉప కాలువలు. పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కిలోమీటర్ల మేర కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాలకు 4.02 లక్షల మందికి తాగునీరు, 110 చెరువులకు ఈ నీటిని మళ్లించడంతో ఇక్కడి చెరువుల పరిధిలోని 6,300 ఎకరాల భూములకు సాగునీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పెద్దపంజాణి మండలంలోని అప్పినపల్లె నుంచి ఈ పనులు 143.9 కి.మీ. పొడవుతో కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువులో కలవాలి. ఇందులో భాగంగా గంగవరం మండలంలోని పశపత్తూరు, వీకోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్ హౌస్‌లను ఈ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యం గల నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి వచ్చిన నీటిని హంద్రీనీవా పైప్రాంతంలోని కాలువకు పంపింగ్ చేశారు. ఇందుకోసం గంటకు 5400 క్యూసెక్ మీటర్ల నీటిని పంపే 5వేల కేవీ మోటార్లను అమర్చారు. దీంతో పాటు నీరు వేగంగా వెళ్లేలా భారీ కంప్రెసర్లు, అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీళ్లు రాలేదు. కానీ వారికి కావాల్సిన కంపెనీలకు నిధులు భారీగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. కానీ ఈ విషయమై స్థానిక హంద్రీనీవా అధికారులు సైతం ఎలాంటి సమాచారం ఇవ్వడానికి సుముఖంగా లేకపోవడం గమనార్హం.



హంద్రీనీవా కుప్పం ఉప కాలువ మ్యాప్

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. బుధవారం జిల్లాలోని అన్ని డివిజన్ల కార్యాలయాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్తూరులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. స్థానికంగా సమస్యలను తెలుపడానికే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సెక్షన్ల వారీగా సమస్యలను తెలపాలన్నారు. అందులో ఆర్థికపరమైనవి అనుమతులు వచ్చాక పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 5 సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని, అందులో రెండింటిని తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్

పెనుమూరు(కార్వేటినగరం): రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు.బుధవారం ఆయన పెనుమూరు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్, సెక్షన్ ఆఫీసును తనిఖీ చేశారు. విద్యుత్ బకాయిల వసూళ్లను వందశాతం పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ జలాశయం వద్ద విద్యుత్ లైన్ల మార్పు పనులను పరిశీలించారు. ఏఈలు తులసీ ప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి, పద్మనాభనాయుడు పాల్గొన్నారు.

రూ.65 లక్షల విలువైన సెల్‌ఫోన్ల అప్పగింత

చిత్తూరు అర్బన్: చోరీకి గురైన, లేదా పోగొట్టుకున్న ఫోన్లను చిత్తూరు పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు. తాజగా దాదాపు రూ.65 లక్షల విలువ చేసే 300 సెల్‌ఫోన్లను బుధవారం బాధితులకు అప్పగించి, చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు, చోరీకి గురైన బాధితులు ఫోన్‌కు సంబంధించిన వివరాలను పోలీసుశాఖ వాట్సాప్‌లో 9440900004 నంబరుకు హాయ్ అని పెట్టి సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, బాధితుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐటీ విభాగం పని చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది దఫాల్లో రూ.5.61 కోట్లు విలువజేసే 2,635 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసిన సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది బాపూజీ, రఘురామ్, శ్రీనివాస్‌కు ఎస్పీ సర్టిఫికెట్లను అందజేసి, అభినందించారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, ఎస్బీ సీఐ భాస్కర్ పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ మణికంఠ

కలెక్టర్ బంగ్లాలో కొండచిలువ



కొండచిలువను చూపుతున్న స్నేక్ క్యాచర్ ప్రేమ్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కలెక్టర్ బంగ్లాలో కొండచిలువ హల్‌చల్ చేసింది. మంగళవారం అర్ధరాత్రి కొండ చిలువను గుర్తించిన కలెక్టర్ బంగ్లా సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వాహనదారులు బంగ్లాలోని వేప చెట్టుపై ఉన్న కొండ చిలువను చూసి ఫోన్‌లో చిత్రీకరించారు. అర్ధరాత్రి సమయంలో వంద మందికి పైగా జనం బంగ్లా వద్ద గుమికూడడంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు నియంత్రించారు. నగరానికి చెందిన స్నేక్ క్యాచర్ ప్రేమ్ కలెక్టర్ బంగ్లాకు చేరుకుని 5 గంటల పాటు శ్రమించి కొండ చిలువను పట్టుకున్నారు. ఆ తర్వాత రిజర్వ్ అటవీ ప్రాంతంలో కొండ చిలువను సురక్షితంగా వదిలిపెట్టారు.

జనావాసాల్లోకి కొండ చిలువ..

గుడుపల్లె: మండలంలోని మిట్టూరు గ్రామానికి సమీపంలో ఉన్న కాలువ పొదల్లో ఓ కొండచిలువ దాక్కొని ఉండగా గ్రామస్తులు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి కొండచిలువను పట్టుకుని గోనే సంచెలో వేసుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అయితే కొండచిలువ ఇళ్ల సమీపంలోకి రావడంతో జనం భయాందోళన చెందారు.

పకడ్బందీగా రీసర్వే గ్రామసభలు

- జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు
- యంత్రాలతో ఇసుకను తోడితే చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా రీ సర్వే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో పలు అంశాలపై మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్, గోకులం షెడ్ల టార్గెట్ పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పాత, కొత్త ఎంపీల నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు అవుతాయన్నారు. జిల్లాలోని మొగిలి ఘాట్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి గత 15 రోజులుగా ప్రమాదాలు తగ్గాయన్నారు. జిల్లావ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

యంత్రాలతో తవ్వితే ఉపేక్షించం..

జిల్లావ్యాప్తంగా కొత్త ఇసుక రీచ్‌లు ఉండవని కలెక్టర్ స్పష్టం చేశారు. నదులు, చెరువుల్లో ఇసుక తవ్వేందుకు ఎవరైనా యంత్రాలను వినియోగిస్తున్నట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పరిశ్రమలకు సంబంధించి ఏపీఐఐసీ శాఖలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా చూస్తామన్నారు. జిల్లాలో నిరుద్యోగ నిర్మూలనకు ఉల్లాస్ కార్యక్రమాన్ని మూడేళ్ల పాటు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

30 లోపు ఫ్రీ హోల్డ్ రైట్స్ పరిశీలన పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ రైట్స్ పరిశీలన ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2024 జూన్ 15 నుండి ఇప్పటి వరకు 8,996 ఫిర్యాదులు నమోదు కాగా 6,399 ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. రీఓపెన్ కేసుల్లో 118 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించి, అర్జీదారులకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని చెప్పారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఆధార్‌లేని గిరిజనులకు కార్డులు ఉండేలా చూడాలన్నారు. పన్నుల వసూళ్ల పట్ల సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలి..

ఉపాధిహామీ పథకంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, అప్రోచ్ రోడ్ల పనులు పూర్తయిన 157 పనులకు సంబంధించిన అన్ని బిల్లులను శనివారం లోపు అప్‌లోడ్ చేయాలని పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో డీఆర్ఓ పుల్లయ్య, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, సీపీఓ సాంబశివారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీపీఓ పార్వతి, మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ సభ్యుల ఎదుటే పెట్రోల్ పోసుకుని..


సుహేల్(ఫైల్)

పలమనేరు: కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లోనే కుటుంబ సభ్యుల ముందే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పలమనేరులో చోటు చేసుకుంది. పెద్దమసీదు వీధికి చెందిన సుహేల్(30) స్థానికంగా ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. గత కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య నెలకొన్న కలహాల కారణంగా బుధవారం సైతం భార్య తరపు వారితో గొడవ జరిగినట్లు తెలిసింది. దీంతో కలత చెందిన సుహేల్ ఇంట్లో దాచిన పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను ఆర్పి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బంధువు కదా అని ఆశ్రయం ఇస్తే..


బీరువాతాళాలు పగులగొట్టిన దృశ్యం

పుంగనూరు: బంధువు కదా అని ఆశ్రయం ఇచ్చిన వ్యక్తి ఇంటికే ఓ ప్రబుద్ధుడు కన్నం వేసిన సంఘటన మంగళవారం రాత్రి వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని నక్కబండకు చెందిన హుసేన్ తన బంధువు బాబాసాబ్ రావడంతో ఇంట్లో ఉండమని సూచించాడు. దీంతో రాత్రి బాబాసాబ్ ఇంటిలోనే ఉన్నాడు. బుధవారం ఉదయం హుసేన్ తన పనుల నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని రూ.50 వేలు నగదు బాబాసాబ్ దొంగలించినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కౌండిన్యలో మరణ మృదంగం

వేటగాళ్ల ఉచ్చుకు చిరుతలు బలి అవుతుండడంతో వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతోంది. చిరుతల గోర్లు, చర్మం, దంతాల కోసం వేటగాళ్లు ఉచ్చు బిగించి పొట్టన పెట్టుకుంటున్నారు. మరోవైపు కౌండిన్య అభయారణ్యంలో అసలు చిరుతలే లేవని అటవీశాఖ అధికారులు చెబుతున్నాయి. అయితే చనిపోతున్న చిరుతలు ఎక్కడి నుంచి వస్తున్నాయో వారికే తెలియాలి. కనీసం ఉన్నవాటినైనా కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

- వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న చిరుతలు
- తాజాగా యాదమరి, సోమల మండలాల్లో రెండు చిరుతలు బలి
- కౌండిన్యలో చిరుతలే లేకపోతే చనిపోతున్నవి ఎక్కడి నుంచి వచ్చినట్లు?
- ఉన్నవాటినైనా కాపాడాలని అటవీ అధికారులకు విన్నపం



పలమనేరు: వేటగాళ్ల ఉచ్చుకు చిరుతలు మృత్యువాత పడుతున్నాయి. అడవిలోని చిరుతపులులను వేటగాళ్లు ఉర్లు, నల్లమందు ఉండలు, కరెంట్ కమ్మీల ద్వారా చంపేస్తున్నారు. గత నాలుగైదేళ్లలో కౌండిన్య అటవీప్రాంతాల్లో ఐదు చిరుతపులులు రకరకాల కారణాలతో మృత్యువాత పడ్డాయి. ఇప్పటికీ కొన్ని చిరుతలు కౌండిన్యలో సంచరిస్తున్నాయి. వీటినైనా అటవీశాఖ కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసలు వన్యప్రాణుల గణన మేరకు కౌండిన్యలో చిరుత పులులే లేవని చెప్పే అటవీశాఖ ఇప్పుడు మృతిచెందుతున్న చిరుతల విషయంలో ఏం సమాధానం చెబుతారో చూడాలి.

పదేళ్లుగా కౌండిన్యలో సంచారం...

ఏనుగులకు నిలయమైన కౌండిన్య అభయారణ్యంలో గత పదేళ్లుగా చిరుతల సంచారం ఉంది. గతంలో పలమనేరు మండలంలోని ఎర్రపెంట అటవీ సమీపంలోని ఇంటి వద్ద కట్టేసిన దూడపై చిరుత దాడి చేసింది. గతంలో కౌండిన్య అడవి సమీప గ్రామాల్లో రెండు దూడలు, ఓ మేక క్రూరమృగాల దాడిలో మృతిచెందాయి. మూడేళ్ల కిందట కౌండిన్య అభయారణ్యానికి పది కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు మోర్దన ఫారెస్ట్‌లోని ఎర్రాంగాళ్‌లో ఓ ఇంట్లోకి వెళ్లిన చిరుత కుటుంబ సభ్యులను గాయపరిచింది. ఆపై అక్కడి ఫారెస్ట్ సిబ్బంది నుంచి తప్పించుకుని సమీపంలోని అడవిలోకి వెళ్లింది. మేతలకు వెళ్లిన పశువులు, మేకలు చిరుతల దాడిలో మృతిచెందిన ఘటనలు వెంగంవారిపల్లి, పెద్దపంజాణిలో చోటుచేసుకున్నాయి. అయితే అవి పులులు, చీతాలు కాదని హైనాలని స్థానిక అటవీశాఖ అధికారులు చెబుతూ వస్తున్నారు.

ఏనుగులే కాదు చిరుతలు ఉన్నాయి..

గత జూన్‌లో కౌండిన్యలో చిరుతల సంచారం అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అప్పట్లో వివరణ ఇచ్చిన అప్పటి ఎఫ్ఆర్వో శివయ్య అసలు కౌండిన్యలో చిరుతపులులే లేవని, అడవిలో కనిపిస్తున్నవి హైనాలని తెలిపారు. తమ జంతుగణనలోనూ ఎక్కడా చిరుతలు ఉన్నట్టు పాదముద్రలు లభ్యం కాలేదన్నారు. అసలు ఏనుగులు సంచరించే అడవుల్లో చిరుతపులులు ఉండవంటూ స్టేట్‌మెంట్ ఇచ్చేశారు.

గత నాలుగేళ్లలో ఐదు మృతి..

- బంగారుపాళెం మండలంలో ఓ చిరుత వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన ఓ చిరుత జూకు చేర్చగా, అక్కడ మృతి చెందింది.
- మూడేళ్ల కిందట పెద్దపంజాణి మండలంలో మరో చిరుత చనిపోయింది.
- గతంలో కౌండిన్య సరిహద్దుల్లోని తమిళనాడు అడవిలో మరో చిరుత మృతిచెందగా స్థానికులు గుర్తించారు.
- తాజాగా యాదమరి మండలం తాళ్లమొడుగులో వేటగాళ్లు చిరుతను చంపి దాని గోర్లు, దంతాలను తస్కరించారు.
- సోమల మండలం చిన్న ఉప్పరపల్లి వద్ద అడవిలో మేకలకాపరులు రెండ్రోజుల క్రితం ఓ చిరుత మృతదేహాన్ని కనుగొన్నారు.

పులి గోర్లు, చర్మానికి భలే డిమాండ్

గతంలో పులిగోర్లను బంగారంతో తయారు చేసుకుని రాజులు వేసుకునేవారట. ఇది రాజసానికి ప్రతీకగా భావించేవారు. ఇటీవల కొందరు క్షుద్రపూజలు చేసేవాళ్లు పులి గోర్లను ధరిస్తే చేతబడి, నరదృష్టి, వశీకరణలు జరగవని చెప్పి నమ్మిస్తున్నారు. ముఖ్యంగా చైనా దేశంలో వీటికి లక్షల్లో ధర పలుకుతోందని సమాచారం. అంతర్రాష్ట్ర స్మగ్లర్ల మాట విని స్థానికంగా ఉన్న వేటగాళ్లు చిరుతలను పొట్టన బెట్టుకుంటున్నారు.

చిరుతల సంతతి పెరిగినట్టే..

పలమనేరు నియోజకవర్గంలోని పలు మండలాలు, బంగారుపాళెం, పెద్దపంజాణి, సోమల మండలాల్లోని అడవులు కౌండిన్యకు సమీపంలో ఉన్నాయి. ఈ అభయారణ్యంలో వందకుపైగా ఏనుగులు గుంపులుగా సంచరిస్తుంటాయి. హైనాలు, చీతాలు ఉన్నట్టు తెలుస్తోంది. పదిదాకా హైనా(దుమ్ములగొండి)లున్నట్టు సమాచారం. రోజు కు 60 కిలోమీటర్ల మేర ఒంటరిగా సంచరిస్తూ వేటాడే చిరుతలు వదిలేసిన జంతువుల కళేబరాలను హైనాలు పీక్కుతింటాయని మేకల కాపరులు చెబుతున్నారు.

వేటగాళ్ల పనే..?

చిత్తూరు కార్పొరేషన్: యాదమరిలో పులి మరణించిన ఘటనలో వేటగాళ్ల పాత్రపై అనుమానం ఉందని డీఎఫ్ఓ భరణి తెలిపారు. పులిని ఒక స్థలంలో ఉచ్చువేసి హింసించి చంపి అటవీ ప్రాంతంలో వేసినట్లు సందేహం ఉందన్నారు. దీనిపై కేంద్ర అటవీశాఖ అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించామన్నారు. సంఘటన జరిగిన స్థలం చుట్టూ అక్రమంగా విద్యుత్ వాడే అవకాశం ఉందా ? అని పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే ఒక అనుమానితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, నిందితుల పరంగా ముఖ్యసమాచారం దొరికిందన్నారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని, చర్యలు తీసుకుంటామన్నారు.

'డాయ్' ఉచ్చులో పడొద్దు

- రహస్యంగా జూమ్ మీటింగ్ నిర్వహణ
- మోసపోవద్దని ప్రజలను హెచ్చరిస్తున్న పోలీసులు



తాజాగా డాయ్ యాప్ నిర్వాహకులు జూమ్ మీటింగ్ కోసం స్మార్ట్‌ఫోన్లకు పంపిన లింకు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో మళ్లీ డాయ్ యాప్ మోసాలకు రంగం సిద్ధమైంది. గతంలో ఇదే యాప్ ద్వారా 300 మంది దాకా రూ.6 కోట్లను పోగొట్టుకున్న విషయం తెలిసిందే. పలమనేరులో దీనిపై మెప్మా పీడీ రాధమ్మతో పాటు పలుశాఖల అధికారులతో కలెక్టర్ ఓ కమిటీని ఏర్పాటుచేసి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందుకు ప్రధాన కారకుడైన మెప్మాలో గతంలో పనిచేసిన రాజేష్ సైతం అరెస్ట్ అయ్యాడు. తాజాగా ఇదే యాప్ ద్వారా మళ్లీ కొందరు వ్యక్తులు రహస్య ప్రదేశాల్లో ఉంటూ జూమ్ మీటింగ్ ద్వారా ఇందులో డబ్బులు పెట్టుబడిగా పెడితే భారీగా లాభాలు ఉంటాయంటూ బుధవారం ఆన్‌లైన్‌లో మీటింగ్ నిర్వహించారు. గతంలో జరిగిన మోసాలు తెలియని చాలామంది ఇందులో పాల్గొని భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. డాయ్ యాప్ ద్వారా ఇప్పటికే మోసాలు వెలుగు చూసినప్పటికీ జనం మళ్లీ మోసపోవడానికి సిద్ధమవుతున్నారు. దీనిపై స్థానిక పోలీసులు సైతం ఇప్పటికే యాప్ మోసాలకు పాల్పడరాదంటూ హెచ్చరించారు. ఇకనైనా ప్రజలు ఇలాంటి మోసపూరిత యాప్‌లకు దూరంగా ఉండాలని, లేదంటే ఇబ్బందులు తప్పవని పోలీసులు సూచిస్తున్నారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్

పుంగనూరు: పట్టణంలో చట్టవిరుద్ధంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న వ్యాపారి మురళిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పట్టణంలో రహస్యంగా లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు నిందితున్ని పట్టుకుని, అతని వద్ద నుంచి లాటరీ టికెట్లు, రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నెట్‌బాల్ జట్టుతో అధ్యాపకులు

నగరి : 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. బుధవారం నగరిలోని ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నమశ్శివాయం, హెచ్ఎం శ్యామలా దేవి నెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. అలాగే పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్–17 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అండర్ బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు బాలుర జట్టుకు కేసీ తేజేష్, పి.భానుప్రకాష్, ఇజాజ్, వెంకట్, రక్షన్, సిద్దిక్, అభినేష్, మోహిత్‌కుమార్, నేత్రసాయి, జశ్వంత్, అప్సర్, అయ్యాన్, గౌతమ్ ఎంపికకాగా, బాలికల జట్టుకు ప్రశాంతి, గీతిక, చరణ్య, రుత్మిక, మహేశ్వరి, మమత, నీరజ, ప్రియదర్శిని, శ్రీహిత, విజయలక్ష్మి, లేఖశ్రీ, తేజశ్రీ, రూబి ఫిర్దోస్ ఎంపికయ్యారు. నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి జట్లు నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వసంత వాణి, బాబు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఎస్ఎంసీ చైర్మన్ షణ్ముగం, రజినీకాంత్, శ్రీకాంత్, డాక్టర్ మంజుల, నగరి బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నిజాం వ్యవహరించగా, ఆర్గనైజర్లుగా సురేష్‌బాబు, గోపి, మణి, పీడీలు, పీఈటీలు వ్యవహరించారు. నెట్‌బాల్‌కు ఎంపికైన క్రీడాకారులకు మణినాథం, సాయి వివేకానంద జూనియర్ కళాశాల వారు దుస్తులు అందించారు.

19 మంది అరెస్ట్

పుంగనూరు: పట్టణ పరిసరాల్లో మద్యం సేవించి వాహనాల్లో పుంగనూరుకు వచ్చే వారిని పుంగనూరు నుంచి వెళ్లే వారిని నాలుగు వైపులా పోలీసులు బుధవారం చుట్టుముట్టారు. వాహనాలను నడిపే వారిని 19 మందిని పట్టుకున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ప్రమాదాలకు కారణం మద్యం సేవించి వాహనాలు నడపడమేనని సీఐ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే.. ప్రమాదాలు జరగడం ఆ కుటుంబాలు వీధిన పడతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు టిప్పర్లు సీజ్

గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పార్టీలోని పెద్దల అండదండలతో మండలంలో గ్రావెల్, ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. మైన్స్ అధికారుల సాధారణ తనిఖీల్లో కూడా భారీ ఎత్తున వాహనాలు పట్టుబడుతున్నాయి. బుధవారం గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన ఆరు టిప్పర్లను మైన్స్ అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి రికార్డులు లేకుండానే, పర్మిట్ చెల్లించకుండా హైవేల్లో తిరుగుతున్న టిప్పర్లను సీజ్ చేసి జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, జిల్లాస్థాయి అధికారులకు సమాచారం అందించామని పోలీసులు తెలిపారు.

నాలుగు నాటు తుపాకులు స్వాధీనం

– ముగ్గురు నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

కల్లూరు (రొంపిచెర్ల): నాలుగు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేటకు సమీపంలోని మామిడి తోటల్లో కొందరు అడవి జంతువులను వేటాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరొకరు పరారయ్యారని చెప్పారు. వారి వద్ద నాలుగు నాటు తుపాకులు ఉన్నాయని తెలిపారు. తుపాకులు స్వాధీనం చేసుకుని ఎం.రెడ్డెమ్మ, పి.గంగులయ్య, ఐ.బాగమ్మ అనే ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. రవి అనే వ్యక్తి పరారయ్యాడని తెలిపారు. మామిడి తోటలో కాపలాగా ఉంటూ అడవి జంతువులను వేటాడుతున్నట్లు నిందితులు తెలియజేశారని చెప్పారు. పరారయిన రవి కోసం గాలిస్తున్నామని, అరెస్టయిన వారిని బుధవారం పాకాల కోర్టులో హాజరు పరచగా జడ్జి వారికి రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు.

ఎంపీటీసీ అనుమానాస్పద మృతి !

- జేసీబీలను ఫైనాన్స్‌లో కొని, ఇతరులకు విక్రయించడం టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు పని
- ఆ తరువాత అసలైన వాహనదారులకు చిక్కకుండా తప్పించుకోవడం..
- ఈ నేపథ్యంలోనే కిడ్నాప్, ఆపై శవమైన వైనం
- ఏలూరు జిల్లా పోలీసుల అదుపులో నిందితులు


జగన్నాథరాజు మృతదేహం

ముసునూరు: ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు శివార్లలో చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. సోమవారం రాత్రి కిడ్నాపైన జగన్నాథరాజు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు కోసం జీడీనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ తన బృందంతో కలిసి వచ్చారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా.. చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలానికి చెందిన నరసింహరాజపురం ఎంపీటీసీ జగన్నాథరాజు(50) జేసీబీలను ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి, వాటిని ఇతరులకు అమ్మిన తర్వాత అసలు వాహన యజమానులకు అందుబాటులో లేకుండాపోవడం ఇతని నైజం. ఈ నేపథ్యంలోనే ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడులో ఒక జేసీబీని ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి కనిపించకుండా పోయాడు. దీంతో జేసీబీ యజమానితో పాటు జగన్నాథరాజు చేతిలో మోసపోయిన పలు జిల్లాలకు చెందిన మొత్తం 12 మంది చిత్తూరు జిల్లాకు వెళ్లి, అతన్ని పట్టుకుని ముసునూరు తీసుకొచ్చారు. అయితే అతను కాట్రేనిపాడు శివార్లలోని పామాయిల్ తోటలో శవమై కనిపించాడు. అప్పటికే వాహనదారులపై జీడీ నెల్లూరులో కేసు నమోద్దు కావడంతో నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ చిరంజీవి స్పందించి నిందితులను అదుపులోకి తీసుకుని, చిత్తూరు పోలీసులకు సహకరించారు. మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, జీడీనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి


పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

పాలసముద్రం : రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని..ఐదు నెలలుగా ఏదో ఒకచోట మహిళలపై నిత్యం దాడులు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ధ్వజమెత్తారు. బుధవారం వారు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారం కానప్పుడు ప్రతి వారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. దేశంలో ఎన్నికల ప్రచారంలో మంచి మందు ఇస్తాను ఓట్లు వేయండని అడిగిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని ఆరోపించారు. గతంలో వేలాది మంది మహిళలు మాయమయ్యారని ఆరోపించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు ఎంతమందిని రక్షించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసి యాదవ్, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ మహేష్, అయ్యప్ప, పోలయ్య, సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, విజయరాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ గణేష్ రెడ్డి, షణ్ముగ రెడ్డి, బాబు, వేణు, లోకిదాస్, తిరుమల, సుబ్రమణి, రవిరెడ్డి, గురుప్రసాద్, ధనుంజయులు, కృష్ణయ్య, చిన్నబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మునేశ్వరస్వామి ఆలయంలో చోరీ


పగలగొట్టిన హుండీ

నగరి : పట్టణ పరిధిలోని కళింమిట్టలో ఇటీవలే కుంభాభిషేక వేడుకలు జరిగిన మహామునేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. చోరీకి పాల్పడిన దుండగులు ఆలయం చుట్టూ ఉన్న సీసీ కెమెరాల్లో కొన్ని ధ్వంస్వం చేయడంతో పాటు కొన్నింటికి వస్త్రం చుట్టేశారు. అలాగే గదిలో ఉంచిన హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేశారు. ఆలయ తలుపులు, హుండీ చుట్టూ వేసిన కాంక్రీట్‌ను పగలగొట్టారు. అనంతరం హుండీలోని డబ్బును తీసుకుని, హుండీని దూరంగా పడేశారు. ఆలయ నిర్వాహకుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం చోరీ జరిగిన ప్రాంతాల్లో ఆధారాల కోసం గాలిస్తున్నారు. అయితే హుండీలో పోగైన నగదు కంటే దుండగులు ధ్వంసం చేసిన వస్తువుల విలువే ఎక్కువ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుంగనూరు: పట్టణానికి చెందిన దస్తగిరి(56) పనుల నిమిత్తం బుధవారం ద్విచక్రవాహనంలో మదనపల్లెకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం జరిగింది. సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు దస్తగిరి బైక్‌పై వెళ్తుండగా యాతాలవంక వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన దస్తగిరిని 108లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.